
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
బుధవారం 3 జనవరి 2024



ప్రజల సంక్షేమం కోసమే 'ప్రజాపాలన' 8
8 న్యూ ఇయర్ సందడి



తెగిన ఆ'ధారం'

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మళ్లీ అతలాకుతలమవుతోంది. దేశ వ్యాప్తంగా వస్త్రోత్పత్తి రంగంలో ఏర్పడిన సంక్షోభంతో సిరిసిల్ల నేతన్నల ఆ'ధారం' తెగిపోయింది. మంగళవారం సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు యాజమాన్యాలు టెక్స్‌టైల్ రంగంలో ఏర్పడిన మాంద్యం పరిస్థితుల్లో బట్ట ఉత్పత్తి చేయలేమని టెక్స్‌టైల్ పార్కును మూసి వేశాయి. దీంతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 1500 నుంచి 2 వేల మంది వరకు కార్మికుల ఉపాధికి గండిపడి వీధిన పడ్డారు. మరోవైపు ప్రభుత్వ ఆర్డర్లు వస్తాయో..లేదో? తెలియని భయం కూడా కార్మికులను వెంటాడుతోంది.

పేరుకుపోయిన బట్ట నిల్వలు

దేశవ్యాప్తంగా నూలు, రసాయనాల ధరలు పెరగడం, ఉత్పత్తికి అనుగుణంగా గిట్టుబాటు ధర రాకపోవడంతో టెక్స్‌టైల్ పార్కులో బట్ట నిల్వలు పేరుకుపోయాయి. టెక్స్‌టైల్ పార్కులో ప్రస్తుతం మరమగ్గాల కార్ఖానాల్లో రూ.25 కోట్ల విలువైన పాలిస్టర్ బట్ట నిల్వలు ఉన్నాయి. టెక్స్‌టైల్ పార్కులో తయారైన బట్టకు ఒక మీటరు రూ.14 నుంచి రూ.15 వరకు ధర రావాల్సి ఉంది. మార్కెట్‌లో మాత్రం ప్రస్తుతం మీటరుకు రూ.12కు మించి రావడం లేదు. మీటరుకు రూ.2 వరకు నష్టం వాటిల్లితున్న దృష్ట్యా ఉత్పత్తిని కొనసాగిస్తే నష్టం మరింత పెరుగుతుందని భావించి పార్కును మూసి వేశారు. సిరిసిల్ల నుంచి గతంలో దక్షిణాది రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు బట్ట ఉత్పత్తులు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం మహారాష్ట్ర, గుజరాత్ పైనే ఆధారపడ్డారు. గత ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంతో ఇతర రాష్ట్రాల నుంచి వస్త్ర వ్యాపారులు సిరిసిల్లకు ఆర్డర్లు ఇవ్వడమే మానివేశారు. కొద్దిమేరకు జరుగుతున్న బట్ట ఉత్పత్తికి కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో కార్ఖానాలు మూతపడ్డాయి.

● తొలి నుంచి బాలారిష్టాలే

సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలను నివారించి వారి కుటుంబాలను ఆదుకునే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు దాదాపు ఇరవై ఏళ్లుగా బాలరిష్టాలు వీడడం లేదు. నిరంతరం ఉత్పత్తి ఆటంకాలను ఎదుర్కొంటోంది.

- సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కుకు తాళం
- వీధిన పడిన 2 వేల మంది కార్మికులు
- వస్త్ర సంక్షోభంలో మూగబోయిన మరమగ్గం
- పార్కులో రూ.25 కోట్ల విలువైన బట్ట నిల్వలు
- గిట్టుబాటు కాదనే యాజమాన్యాల బంద్
- ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కార్మిక సంఘాల డిమాండ్

ఎప్పుడైనా కూలి పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి కార్మికుల ఆందోళనతో పరిశ్రమలు మూతపడేవి. ఈసారి మాత్రం మార్కెట్‌లో బట్టకు గిట్టుబాటు ధరలేక టెక్స్‌టైల్ పార్కులో యజమానులు నిరవధిక బంద్ చేపట్టారు. 2002 - 2003 సంవత్సరంలో సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం సారంపల్లి, బద్దెనపల్లి గ్రామాల మధ్య 60 ఎకరాల్లో రూ.7.73 లక్షలతో టెక్స్‌టైల్ పార్కును నిర్మించారు. 2004లో పార్కు పూర్తయినా పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం తరఫున అధికారులు గుజరాత్, మహారాష్ట్రలోని పారిశ్రామికులను కలిసి ఆహ్వానించారు. వివిధ హామీలు ఇవ్వడంతో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చారు. సిరిసిల్ల పార్కులో 1200 గజాల చొప్పున 171 ప్లాట్లు, 600 గజాల చొప్పున 106 ప్లాట్లు, 32 వాణిజ్య అవసరాల కోసం ప్లాట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టెక్స్‌టైల్ పార్కులో 165 ఇండస్ట్రీ యూనిట్లు, 27 కమర్షియల్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో 115 యూనిట్లలో 1475 ఆధునిక రాపియర్ మరమగ్గాలపై ఉత్పత్తులు జరుగుతున్నా టెక్స్‌టైల్ రంగంలోని సంక్షోభంతో నడవని పరిస్థితి నెలకొంది. పార్కులో గతంలో ప్రైవేటు బట్ట ఉత్పత్తులపైనే ఆధారపడ్డారు. ఇదే క్రమంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్, ఆర్వీఎం క్లాత్ ఉత్పత్తి ఆర్డర్లను పార్కులోని పరిశ్రమలకు కేటాయించింది. ప్రభుత్వ ఆర్డర్లు రావడంతో పార్కులోని పరిశ్రమల్లో ప్రైవేటు ఉత్పత్తులు దూరమయ్యాయి. ప్రైవేటు ఉత్పత్తులు అనుకూలంగా రాకపోవడంతో పార్కులో పరిశ్రమలు భారంగా మారాయి. మరోవైపు విద్యుత్ కూడా భారమైంది. గతంలో సిరిసిల్ల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు బట్ట ఎగుమతులు ఎక్కువగా జరిగేవి. తమిళనాడు, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, అహ్మదాబాద్, కేరళ, ఢిల్లీ వరకు సిరిసిల్ల బట్ట వెళ్లేది. ప్రస్తుతం గుజరాత్‌లోని సూరత్, మహారాష్ట్రలోని భీవండిపైనే ఆధారపడి ఉత్పత్తి చేస్తున్నారు. సిరిసిల్లలో ఆధునిక ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడం, బట్ట ఉత్పత్తిలో మార్పులు రాకపోవడం వంటి పరిణామాలను నష్టాలకు కారణంగా భావిస్తున్నారు.

● ఆధునిక మరమగ్గాల విక్రయం

సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు దేశంలో అగ్రగామిగా నిలుస్తుందని భావించినా సరైన ప్రోత్సాహం లేక వ్యాపారులు ఆధునిక మరమగ్గాలను సైతం విక్రయించి కార్ఖానాలు మూసి వేసిన సందర్భాలు ఉన్నాయి. టెక్స్‌టైల్ పార్కులో మరమగ్గాల యూనిట్ల ఆధునీకీరణకు కొత్త యూనిట్లు నెలకొల్పేవారికి 25 శాతం ప్రోత్సాహక సబ్సిడీ ఇవ్వాలని, కార్ఖానాలకు ఇచ్చిన ఎన్‌వోసీ గైడ్‌లైన్స్‌లో మార్పులు చేయాలని యజమానులు కోరుతున్నారు. టెక్స్‌టైల్ పార్కులో యారన్ టెస్టింగ్ ల్యాబ్, కామన్ ఫెసిలిటీ సెంటర్, కార్మికులకు నైపుణ్య శిక్షణ రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి

సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులోని కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి శాశ్వత ఉపాధి చూపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. మంగళవారం సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులో జిల్లా పవర్‌లూం వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు, యజమానుల వైఖరితో టెక్స్‌టైల్ పార్కులో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లతో ప్రత్యక్షంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ వస్త్ర పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నామంటూ పరోక్షంగా ఉపాధిని సంక్షోభంలోకి నెట్టివేశారన్నారు. బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లు రావడంతో యజమానులు ప్రైవేటు ఆర్డర్లపై దృష్టి కేంద్రీకరించలేదని, ప్రభుత్వ ఆర్డర్లు వస్తేనే ఉపాధి అన్నట్లుగా మారిందని అన్నారు. ప్రభుత్వ ఆర్డర్లు వచ్చినప్పుడు కూడా స్థానిక కార్మికులకు కాకుండా వలస కార్మికులకే ఉపాధి దొరుకుతోందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, టెక్స్‌టైల్ పార్కు కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యామ్నాయంగా దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, నాయకులు అక్కల శ్రీనివాస్, అడెపు రవి, శేఖర్, నాగయ్య మనోహర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంతోనే పరిశ్రమల మూత

- అన్నల్‌దాస్ అనిల్, అధ్యక్షుడు టెక్స్‌టైల్ పార్కు క్లాత్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్



వస్త్రోత్పత్తి రంగంలో ఏర్పడిన సంక్షోభం, ఉత్పత్తి చేస్తున్న బట్టకు గిట్టుబాటు ధర లేకపోవడంతోనే టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలు మూసి వేశారు. బహిరంగ మార్కెట్‌లో మీటరు బట్టపై రూ.2 నష్టం ఉంది. ఉత్పత్తి ప్రారంభించినా సరైన ఆర్డర్లు లేక నడవని పరిస్థితి నెలకొంది.

4,5 తేదీల్లో కేంద్ర బృందం పర్యటన




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా జలశక్తి అభియాన్ కింద జిల్లాలో చేపట్టిన పనుల పరిశీలనకు కేంద్ర బృందం ఈ నెల 4, 5 తేదీల్లో రానున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జలశక్తి అభియాన్ బృందం పర్యటనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులకు చూపించాలన్నారు. కేంద్ర బృందం పర్యటనకు క్షేత్ర స్థాయిలో ప్రణాళిక రూపొందించాలన్నారు. బెస్ట్ వర్క్‌లను సందర్శించేలా చూడాలన్నారు. పనులతో కలిగిన ప్రయోజనాలను సభ్యులకు వివరించాలని, కేంద్ర బృందం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఎస్. ఖీమ్యానాయక్, జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ రాణీప్రసాద్‌కు గవర్నర్ అభినందనలు





గవర్నర్ తమిళిసైతో రాణీప్రసాద్, 'డాక్టర్ చెప్పిన కథలు' సంకలనం

సిరిసిల్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ చెప్పిన కథల పుస్తకం సామాన్య ప్రజలకు బాగా ఉపకరిస్తుందని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశంసించారు. ప్రభుత్వ విశిష్ట మహిళా అవార్డు గ్రహీత, బాల సాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ రచించిన 'డాక్టర్ చెప్పిన కథలు' సంకలనాన్ని గవర్నర్‌కు అందించారు. మంగళవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో కొంత మంది మహిళా రచయితలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాణీప్రసాద్ డాక్టర్ చెప్పిన కథల సంకలనంతోపాటు మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాంతో కలిసిన సైన్స్ విషయాలతో కూడిన పుస్తకాలు, అబ్దుల్‌కలాం జీవిత చరిత్ర పుస్తకాలను గవర్నర్‌కు ఇచ్చారు. రాణీప్రసాద్ సైన్స్ పరంగా బాలసాహిత్యాన్ని అందిస్తున్న తీరు బాగుందని గవర్నర్ కొనియాడారు.

సెల్ ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, జనవరి 2: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో రెండు నెలల కిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఐఎంఈఐ ద్వారా గుర్తించి మండల కేంద్రానికి చెందిన బాధితుడు రామిండ్ల రత్నయ్యకు మంగళవారం అందజేశారు. మూడు నెలల్లో మొత్తం 47 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామని పేర్కొన్నారు. ఎవరైనా సెల్ ఫోన్ పోగొట్టుకుంటే తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అధ్యాపకుడికి పదోన్నతి

వేములవాడ టౌన్, జనవరి 2 : వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్డకొండ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో మంగళవారం డాక్టర్ శ్రీనివాస్‌ను అధ్యాపక బృందం సన్మానించింది. అధ్యాపకులు మధు రాజేష్, వెంకటేశ్వర్లు, డాక్టర్ అఫ్సారీ ఉస్మానీ, రమాదేవి ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడ, జనవరి 2: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ లహరిక, డాక్టర్ పావని ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించామని, అవసరం ఉన్నవారికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామన్నారు. విద్యార్థులు తీసుకోవాల్సిన ఆహారం, పరిశుభ్రతపై వివరించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంజయ్య, ఫార్మసిస్ట్ ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభంపల్లి పాఠశాల తనిఖీ



పరిశీలిస్తున్న డీఈవో

బోయినపల్లి, జనవరి 2: బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను డీఈవో రమేష్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, లక్ష్య రిజిష్టర్‌లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో సమస్యలు తెలుసుకున్నారు. మరో రెండు నెలల్లో 10వ తరగతి పరీక్షలు ఉండనున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, 100 శాతం ఉత్తీర్ణత వచ్చేలా విద్యా ర్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజాపాలన'



దరఖాస్తు తీసుకుంటున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 2: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని 14వ వార్డు ప్రజాపాలన సభలో మాట్లాడారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీలను తమ ప్రభుత్వం తప్పనిసరిగా అమలుచేస్తుందన్నారు. అర్హులైన ప్రతీ పథకానికి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పింఛన్ వస్తున్న వారికి త్వరలోనే రెట్టింపు అవుతుందని, ఇందుకోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజలు అందుకునే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్, స్థానిక కౌన్సిలర్ బింగి మహేశ్, అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో అయ్యప్ప స్వాములు, భక్తులు

వీర్నపల్లి, జనవరి 2 : వీర్నపల్లి మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. స్వామియే శరణం అయ్యప్ప అంటూ స్వామిని కీర్తిస్తూ సాగిన శోభాయాత్ర భక్తి భావాన్ని నింపింది. అయ్యప్ప స్వాములు, భక్తజన వాహినితో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

గోశాలకు రాజన్న కోడెల అప్పగింత

వేములవాడ టౌన్, జనవరి 2: వేములవాడ రాజరాజేశ్వరస్వామి గోశాల నుంచి ఇతర గోశాలకు మంగళవారం కోడెలను అప్పగించారు. మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గో శాల నుంచి 20 కోడెలను మహబూబాద్ జిల్లా తొర్రూర్ మండలం జీకే తండాకు చెందిన సోమేశ్వర గో సంరక్షణ సేవా సంఘానికి అప్ప గించినట్లు ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ నరసింహమూర్తి తెలిపారు.

పెట్రోల్ కోసం బారులు



పెట్రోల్ కోసం బారులుదీరిన వాహనదారులు

సిరిసిల్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెలోకి వెళ్తున్నారనే ప్రచారంతో మంగళవారం రాత్రి పెట్రోల్ బంకుల్లో వాహనదారులు బారులుదీరారు. రోడ్లపై వాహనాలు క్యూ కట్టాయి. కొందరు బాటిల్‌లలో నింపుకొని నిల్వ ఉంచుకున్నారు. క్యూలైన్లలో వాగ్వాదం చోటు చేసుకుంది. సమ్మె విరమించినట్లు లారీ డ్రైవర్లు ప్రకటించినా వాహనదారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

ఎన్నికల సందర్భంగా ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు, డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎన్నికల వ్యయ సున్నితమైన నియోజకవర్గాలు, ప్రాంతాలను గుర్తించుటకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇంటలిజెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెకటర్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి కమిటీలో జిల్లా రెవెన్యూ శాఖతో పాటు సభ్యులుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతల సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక ఏర్పాటు చేయాలన్నారు. నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు, ఏసీపీ పి కిష్టయ్య, ఇన్‌కంటాక్స్ అధికారి ఆర్ రాజేష్, జీఎస్టీ అధికారి వి మధునయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఎలక్షన్ డీటీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ఎస్‌యూ ఎంఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జనవరి 2: ఎస్‌యూ పరిధిలోని ఎంఈడీ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.వీ.శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

'కరీంనగర్-హసన్‌పర్తి రైల్వేలైన్ పనులు త్వరలో ప్రారంభం'

భగత్‌నగర్, జనవరి 2: కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పద్మశాలి భవన్‌లో సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు తీసుకు వచ్చానన్నారు. ప్రజల కోరిక మేరకు కరీంనగర్-హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే పనులు పూర్తి కాబోతున్నాయన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం పాకులాడితే 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేవాడినన్నారు. తనకు ధర్మమే ముఖ్యమని, హిందు ధర్మ రక్షణ కోసం ఎంతవరకైనా వెళతా.. కానీ ఓట్లకోసం పాకులాడేది లేదన్నారు. రాష్ట్రంలో కుల వృత్తులు,కుల సంఘాల అభ్యున్నతికి పైసలిచ్చేందుకు వెనుకాడే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న, మత మార్పిడులను ప్రోత్సహిస్తున్న తబ్లిగ్‌జమాతే వంటి సంస్థలు నిర్వహించే సభలు సమావేశాలకు రూ.3 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా హిందుసమాజం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ప్రజలకు ఉపయోగపడే చట్టాలు కార్యరూపం దాల్చాలంటే బీజేపీ గెలుపు అనివార్యమన్నారు. భారత పౌరులంతా దేశంలో ఎక్కడికైనా వెళ్లి స్థలం కొనుక్కొని ఇల్లుకట్టుకుని నివసించే అవకాశం ఉంటుందని, వివాహాలు చేసుకునే అవకాశం ఉందని, కశ్మీర్‌లో మాత్రం అవకాశం లేకుండా కాంగ్రెస్ పాలకులు చేశారన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 2: రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆనవాయితీ ప్రకారం మంగళవారం నాడు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రాజన్న ఆలయానికి అదనపు భద్రత

- 11 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది కేటాయింపు - మహాశివరాత్రి వరకు విధులు నిర్వహించనున్న సిబ్బంది



వేములవాడ చేరుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

వేములవాడ, జనవరి 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అధికారులు అదనపు భద్రత కల్పించారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భద్రత కోసం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) విభాగానికి చెందిన సిబ్బంది భద్రతను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు హెడ్‌కానిస్టేబు ల్స్, పదిమంది పోలీస్ కానిస్టేబుల్‌లతో కలిపి మొత్తం 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరిలో మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జరగనున్న తరుణంలో కొద్ది వారాలుగా వేములవాడ రాజన్న ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో వేములవాడకు వస్తుండడంతో ఆలయానికి అదనపు భద్రత కల్పించాలని కోరుతూ ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ ఉన్నతాధికారులను కోరారు. దీంతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగం నుంచి ఒక ఏఎస్‌ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఎనిమిది మంది కానిస్టేబుల్స్‌ను రాజన్న ఆలయానికి అదనంగా కేటాయించారు. మార్చి 7, 8, 9వ తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి జాతర వరకు అదనపు సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఆలయంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి మరో పదకొండు మంది అదనంగా వచ్చి చేరడంతో మొత్తం ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది సంఖ్య 23 కు చేరుకుంది. వీరికి అదనంగా 33 మంది హోంగార్డులు కూడా ఆలయ భద్రత విధుల్లో పాల్గొంటున్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తాళ్ల శృతి



కోనేటి అభినవ్

తిమ్మాపూర్, జనవరి 2: మండలంలోని మొగిళిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాళ్ల శృతి, కోనేటి అభినవ్ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తొర్రూరు జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ అండర్ 17పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి ఈనెల 3 నుంచి 6వ తేది వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, బిలాస్పూర్‌లో జరగనున్న 67వ జాతీయస్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ సుస్మితారెడ్డి, ఎంపీటీసీ తిలక్ ప్రియా రెడ్డి, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 70మంది రైతులు 669 క్వింటాళ్ల విడి పత్తి, ఆరుగురు రైతులు గోనె సంచుల్లో ఏడు క్వింటాళ్లు విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు, కనిష్ఠ ధర 5,400 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 2: స్థానిక ఎస్‌బీఐ ఆర్‌సెటి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో జనరల్ ఈడీపీ(వ్యాపార నైపుణ్యాభివృద్ధి)లో ఈ నెల 8 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 18-45 సంవత్సరాలు గల గ్రామీణ పురుషులు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 9949448197, 9849411002 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు

తిమ్మాపూర్, జనవరి 2: డిసెంబరు 31న రాత్రి విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నాలుగురిపై ఎల్‌ఎండి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. ఎల్‌ఎండి ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో డిసెంబరు 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా ఎల్‌ఎండి పోలీసులు, క్విక్ రెస్పాన్స్‌టీ(క్యూఆర్‌సి) పోలీసులు విధులు నిర్వర్తిస్తుండగా అలుగునూర్‌కి చెందిన కొందరు టాపాసులు పెల్చుతు, కేక్ కట్ చేస్తుండగా దాన్ని పోలీసులు అడ్డుకునేందకు ప్రయాత్నం చేసి టాపాసులు పేల్చవద్దని ఆదేశించారు. అయిన వారు వినకుండా విధుల్లో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తు, దుర్భాషాలాడారు. దీంతో అలుగునూర్‌కి చెందిన గోపు మల్లారెడ్డి, బైరీ రాజు, బుర్ర లక్ష్మణ్, రమేష్ నలుగురిపై సెక్షన్ 294, 353 కింద సోమవారం కేసులు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

శంకరపట్నం, జనవరి 2: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఇటీవల ఓ వృద్ధుడు తప్పిపోయి శవంగా లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబరు 15న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన బండారి భూమయ్య (80) అనే వృద్ధుడు కనిపించకుండా పోయాడు. దీంతో మృతుడి కూతురు బాడిష సుజాత గత నెల 18న కేశవపట్నం పోలీస్ స్టేషన్లో తన తండ్రి భూమయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నూతన సంవత్సరం నాడు కరీంపేట గ్రామంలో వృద్ధుడి శవం వ్యవసాయ భూమి పొదల పక్కన పడి ఉందని సమాచారం వచ్చింది. దీంతో మృతుడి కూతురు వెళ్లి చూడగా తన తండ్రిదేనని గుర్తించింది. తన తండ్రి మతిస్థిమితం లేక తిరుగుతూ కరీంపేట గ్రామ శివారులోని ఓ కౌలు రైతు పొలంలో పడిపోయి మృతి చెందాడని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేయించాలి

- జనవరి చివరిలోగా రోడ్ల మరమ్మతులు - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకున్నవారి నుంచి దరఖాస్తులు చేయించాలని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపెల్లి, భూపతిపూర్, వీరాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. భూపతిపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని అప్లికేషన్ పత్రంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోర్నపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పంపులను పరిశీలించి త్వరలోనే శుద్ధి నీరు అందజేస్తామని తెలిపారు. బోర్నపల్లి గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన భారతపు లక్ష్మీనర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందించాలని సూచించారు. రామాజీపేట నుంచి వీరాపూర్, వీరాపూర్ నుంచి రాయికల్ ఎక్స్ రోడ్డులో కల్వర్టు చెడిపోవడంతో మరమ్మతులు చేపట్టకపోవడంతో వీరాపూర్, రామాజీపేట గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, రెన్యూవల్ బ్రిడ్జి మంజూరై టెండర్ కూడా పూర్తయినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టి భవిష్యత్‌లో ఎప్పుడూ ఎలాంటి ఆటంకాలు రాకుండా చూస్తామన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షానికి రోడ్డు కోతకు గురై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా సమస్యను జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్సీ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమ వెంకటేష్, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సారెడ్డి, భూపతిపూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, జక్కుల సాగర్ విష్ణు, శేఖర్ రెడ్డి, నాగరాజు, రాజు, సంతోష్, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల తగ్గింపు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు తగ్గించారు. ఇప్పటివరకు 6 వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా 3,500 క్యూసెక్కులకు తగ్గిస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 70.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 79.621 టీఎంసీల నీరు ఉంది.

ప్రాజెక్టు నుంచి 7,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు ఆరు వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 472 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 150.917 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కిరాణా షాపు దగ్ధం

మల్లాపూర్, జనవరి 2: షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని కస్తూరి సంతోష్‌కుమార్‌కు చెందిన కిరాణా షాపు దగ్ధమైంది. మంగళవారం కిరాణం షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానికుల సహాయంతో మంటలను ఆర్పి వేశారు. అప్పటికే షాపులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సంతోష్ తెలిపారు. ప్రభుత్వం సహాయం అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మారుతి(ఫైల్)

రాయికల్, జనవరి 2: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి మారుతి (24) ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు కింద పడి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతి తన స్నేహితుడు సింగం నరేష్‌తో కలిసి మంగళవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో మైతాపూర్ నుంచి అల్లీపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాయికల్ తహసీల్దార్ కార్యాలయం మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి దగ్గరలోని ఇంటికి గల షట్టర్స్‌ను ఢీకొట్టి కింద పడ్డారు. దీంతో మారుతి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న నరేష్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మారుతి తండ్రి రాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

● **బైక్ అదుపు తప్పి మరో యువకుడు..**



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కథలాపూర్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని తన స్నేహితున్ని పక్కన గ్రామంలో దించి కోరుట్లకు వెళ్తున్న యువకుడు బైక్ అదుపు తప్పి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బీమారం మండలం పసునూరుకు చెందిన బెజ్జంకి అభిలాష్ (21) గత నెల 31న స్నేహితులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నాడు. పక్కనే ఉన్న రాజలింగంపేటలో తన స్నేహితున్ని దించి పనిమీద కోరుట్లకు బయలు దేరాడు. టీఎస్ 02 ఈపీ 1941 నంబర్ గల బైక్‌పై వెళ్తున్న క్రమంలో మండలంలోని గంభీర్‌పూర్ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడ్డాడు. గోతిలో నీళ్లు ఉండడంతో మునిగి చనిపోయాడు. రెండు రోజుల నుంచి ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో అభిలాష్ జాడ కుటుంబ సభ్యులకు తెలియలేదు. మంగళవారం అటువైపు వెళ్తున్న రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు.



ఇబ్రహీం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహేష్

గంభీరావుపేట, జనవరి 2: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ ఇబ్రహీం (55) అనే వ్యక్తి నమాజ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. ఇబ్రహీం గేదెల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. నాలుగేళ్ల కిందట పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. కర్ర సాయంతో జీవనం సాగిస్తువచ్చాడు. ఆరోగ్యం సహకరించక పోవడం, ఎవ రూ పట్టించుకోక పోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. ఇటీవల, పిల్లలతో సహా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇబ్రహీం మరింత మానసిక వేదనకు లోనయ్యాడు. బీడీలు తెచ్చుకుంటానని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లో నుం చి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాక పోవడంతో బంధువులు వెతికారు. మంగళవారం గ్రామ సమీపంలోని నమాజ్ చెరువులో శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఒడ్నాల పరమేశ్వర్ (53) అనే చిరువ్యాపారి మంగళవారం కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... రాజీవ్‌నగర్‌కు చెందిన పరమేశ్వర్ దుస్తులు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం అతడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. తాగుడుకు బానిసై వ్యాపారం తగ్గించాడు. మరోవైపు రూ. 2లక్షల అప్పులు అయ్యాయి. వివాహం చేయాల్సిన కూతురు ఉంది. జీవనోపాధికి సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద పరమేశ్వర్ ఇటీవల చాయ్ హోటల్ ఏర్పాటు చేశాడు. సక్రమంగా నడవకపోవడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయల్దేరి కొత్త చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ ఫోన్ తీసుకొని భార్య కృష్ణవేణికి కాల్ చేశాడు. తాను చెరువులో దూకి చనిపోతున్నాని, కాపాడుకోమని పెట్టేశాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ అతడిని వారించినా వినిపించుకోకుండా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పరమేశ్వర్ భార్యకు ఫోన్ చేసి వాచ్‌మెన్ విషయం చెప్పాడు. తనకు ఈత రాదని వాచ్‌మెన్ పేర్కొన్నాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా పరమేశ్వర్ చెరువులో శవమై కనిపించాడు. కృష్ణవేణి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ముకరంపురకు చెందిన ఎం. వాసంతిశెట్టి(61) అనే వృద్ధురాలు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఒక హోటల్ యజమాని భార్య అయిన వాసంతి కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆమె మానసిక పరిస్థితి సరిగాలేక ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో వాసంతి తన ఇంటిలోని వంట గదిలోకి వెళ్లి చీరకు నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన ఆమె కుటుంబ సభ్యులు, వర్కర్లు బలవంతంగా తలుపులు తెరిచి ఆమెను ఒక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. రెండేళ్ల కిందట వాసంతిపై గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వెళ్లి దాడి చేశాడని కేసు నమోదు కాగా పోలీసుల విచారణలో ఎవరు దాడి చేయలేదని వెల్లడైంది. తాజాగా ఆమె ఆత్మహత్యకు పాల్పడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి కారణం తెలుస్తుందని సీఐ తెలిపారు.

బిర్యాని సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురి రిమాండ్

జమ్మికుంట, జనవరి 2: జమ్మికుంట పట్టణంలోని ఓ బిర్యాని సెంటర్‌పై దాడి చేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసిన సంఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ బర్పటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31న బిర్యాని సెంటర్‌కు వచ్చిన ఐదుగురు యువకులు, సిబ్బంది మధ్య జరిగిన వాగ్వాదం జరగగా యువకుడు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. హోటల్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి అరవింద్, జి రాజు, పి హరీష్, పి సాగర్, పి అనిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కెమెరా దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 2: కలెక్టరేట్ ఎదుట నాలుగు రోజుల క్రితం ఒక కెమెరామెన్ బ్యాగ్ చోరీకి గురి కాగా పోలీసులు మంగళవారం నిందితుడిని పట్టుకుని వీడియో కెమెరాతో పాటు అందులోని పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ ఏసీపీ జి నరేందర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. కట్టరాంపూర్‌కు చెందిన జునుగారి శంకర్ కూలి పనిచేస్తూ తాగుడుకు బానిసగా మారాడని, మద్యం కోసం డబ్బులు లేక డిసెంబరు 30న కలెక్టరేట్ ఎదుట బైక్‌పై కనబడిన కెమెరా బ్యాగును ఎత్తుకెళ్లాడని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా నిందితుడి కోసం గాలిస్తుండగా మంగళవారం అంబేద్కర్ స్టేడియం వద్ద శంకర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాగును ఎత్తుకెళ్లిన నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడు గతంలో ఏడు నేర ఘటనలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్టు ఆయన తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కోల్‌సిటీ, జనవరి 2: గోదావరిఖని సప్తగిరికాలనీలో జరిగిన వంచర్ల గంగాధర్‌రావు హత్య కేసులో నిందితుడు చోడ రవితేజ(30)ని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ప్రమోద్ రావు పేర్కొన్నారు. గత నెల 31వ తేది రాత్రి చోడ రవితేజ, గంగాధర్‌రావులు గొడవపడ్డారని, డబ్బుల విషయంలో తిట్టుకున్నారన్నారు. రవితేజ వద్ద గంగాధర్‌రావు కూలీగా పని చేస్తున్నాడని, తరచూ డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో అతన్ని తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. తీవ్ర రక్తస్రావంతో రవితేజ మరణించాడన్నారు. మృతుడి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు.

మద్యం సీజ్

కరీంనగర్ క్రైం, జనవరి 2: రాంనగర్‌లోని అప్నా వైన్ షాపు పక్కన పర్మిట్‌రూంలో ఎలాంటి అనుమతి లేకుండా అధిక ధరకు మద్యం విక్రయి స్తున్నారని రెండో టౌన్ పోలీసులు తనిఖీలు చేసి 6,130 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మంగళవారం ఉదయం 5:40 గంటలకు అందిన సమాచారం మేరకు పర్మిట్ రూం వద్ద తనిఖీ చేయగా పర్మిట్ రూం నిర్వాహకులు వల్లకొండ బాపురెడ్డి, భోగ రాజేందర్‌లు అధిక ధరకు మద్యం విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పర్మిట్ రూం నిర్వాహకులు ఇద్దరిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శోకసంద్రమైన జగ్గరావుపల్లి

- స్వగ్రామానికి చేరుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి మృతదేహం

బోయినపల్లి, జనవరి 2: మండలంలోని జగ్గరావుపల్లికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి (23) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకోగా సీఐఎస్ఎఫ్ అధికారులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శివకృష్ణారెడ్డి రాజస్థాన్‌లోని డీవోలిలో 6వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత నెల 16న ప్రమాదవశాత్తు కింద పడడంతో కోమాలోకి వెళ్లాడు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకృష్ణారెడ్డి సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ అధికారులు స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యమైన కొదురుపాక నుంచి యువకులు బైక్ ర్యాలీతో జగ్గారావుపల్లికి తీసుకోవచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంపై పడి బోరున విలపించారు. పార్థివదేహాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శివకృష్ణారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. జైపూర్ నుంచి పార్థివ దేహంతో వచ్చిన సీఐఎస్ఎఫ్ అధికారులు మృతుడి యూనిఫామ్‌ను, జాతీయ జెండాను తల్లిదండ్రులకు అప్పగించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తహసీల్దార్ పుష్పలత, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్ నివాళులర్పించారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనిదేవి వ్రతాలు

మెట్‌పల్లి, జనవరి 2: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి సామూహిక వ్రతాలను ఘనంగా భక్తులు చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి, కాత్యాయనిదేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఆయలంలో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి, ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీఐకి విక్రయించే రైతులు సమాచారం ఇవ్వాలి

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, జనవరి 2: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి పత్తి విక్రయించే రైతులు మార్కెట్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. 'పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి మాట్లాడుతూ రైతులు ఎంత పత్తి అమ్మకానికి తీసుకు వస్తున్నారు, భూమి ఎంత ఉంది, ఆన్‌లైన్‌లో నమోదైన విస్తీర్ణం ఎంత, పత్తి ఎన్ని క్వింటాళ్లు అమ్ముకోవచ్చనే వివరాలను మార్కెట్ అధికారులు వెల్లడిస్తారన్నారు. పత్తి తీసుకు వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో భూమి నమోదై లేకుంటే సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. రైతులు ఎప్పుడు ఫోన్ చేసినా మార్కెట్ అధికారులు వివరాలు వెల్లడించేందుకు సిద్ధంగా ఉంటారని, రైతులు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

న్యూ ఇయర్ సందడి





కలెక్టర్ అనురాగ్ జయంతికి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో సందడి నెలకొంది. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌కు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణకు జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా ఆడిట్ అధికారి స్వప్న, సీపీవో శ్రీనివాసచారి, డీపీవో రవీందర్, డీపీఆర్వో దశరథం, ఈడీ వినోద్‌కుమార్, డీసీవో బుద్ధనాయుడు, కార్మిక అధికారి రఫీ, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, ఉపాధి కల్పన అధికారి రాఘవేంద్ర, బీసీ శాఖ అధికారి మోహన్, మైనార్టీ శాఖ అధికారి సర్వర్‌మియా, ఏవో రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సిరిసిల్ల టౌన్: కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్, ఆర్డీవో, డీఎస్‌వో, డీఎం, తహసీల్దార్, ఏవో, డీటీ, డీటీసీఎస్, సిబ్బందికి మంగళవారం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు, డివిజన్ మండల ప్రతినిధులు గాజుల శ్రీనివాస్, మందాల ప్రసాద్‌బాబు, వావిలాల ఆనందం, ఎండీ అజీమ్, ఎర్ర నర్సయ్య, గుడెల్లి మధూసూదన్, సభ్యులు కొండ శంకర్, జిందం శ్రీనివాస్, రాగటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో గ్రామం అభివృద్ధి

ఇల్లంతకుంట, జనవరి 2: ప్రజల సహకారంతో పెద్దలింగాపూర్ గ్రామం అభివృద్ధి చెందిందని సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ అన్నారు. రూ.20 లక్షల నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం ప్రారంభోత్సవానికి అనివార్య కారణాలతో రాలేనని ఎమ్మెల్యే సత్యనారాయణ చెప్పారన్నారు. వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఎస్సై సుధాకర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నారాయణ, ఉపసర్పంచ్ కుమార్, ప్యాక్స్ డైరెక్టర్ వసంతనర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

ముస్తాబాద్, జనవరి 2: ముస్తాబాద్ మండల కేంద్రంలో రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్షేత్రస్థాయిలో వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ నరేష్, ఉపాధ్యాయినులు పద్మ, మంజుల, సంధ్య, అపర్ణ, భాను పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, జనవరి 2: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాలో కొంతమంది కావాలని ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని కించపర్చేలా పోస్టింగులు పెట్టారని, వారిని వెంటనే గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కాథ మల్లేశం, మూడపెల్లి చందు, భరత్‌రెడ్డి, గూడ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలలో న్యూ ఇయర్ వేడుకలు

రుద్రంగి, జనవరి 2 రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్ డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకటిరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 2: అమెరికాలో విద్యను అభ్యసించడంతోపాటు పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన యువకులు సాయికృష్ణరెడ్డి, నటరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిప్రసాద్ మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లోని వృద్ధులకు పండ్లను అందించేందుకు ముందుకొచ్చారు. మిత్రుల సహకారంతో మంగళవారం పంపిణీ చేశారు. ఏడాది పాటు వృద్ధులకు అల్పాహారం అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 2: బోయినిపల్లి మండలం దుంద్రపల్లి శివారులోని తన పొలంలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, సర్వీస్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని వేములవాడ రూరల్ వట్టెంలకు చెందిన ముష్కం శంకరయ్య డిమాండ్ చేశాడు. మంగళవారం సెస్ ఎండీకి ఫిర్యాదు చేశాడు. గతంలో బోయినపల్లి ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నాడు. ఇప్పటికైనా స్పందించాలని కోరాడు.

ఎల్లారెడ్డి, భూపతిరెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 2: సిరిసిల్ల పట్టణం కొత్త చెరువు ట్యాంక్ బండ్‌పై తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి కంచు విగ్రహాలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కోనరావుపేట మండలం మక్కపేట రిజర్వాయర్‌కు మాజీ శాసన సభ్యుడు కర్రల నర్సయ్య పేరు పెట్టాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు నీలకంఠం

గంభీరావుపేట, జనవరి 2: ఈ నెల 5న రాజమండ్రిలో నిర్వహించనున్న రెండో ప్రపంచ తెలుగు మహా సభలకు గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన రచయిత గుండెల్లి నీలకంఠంకు ఆహ్వానం అందింది. సభ ప్రచార కార్యదర్శి వాసరవేణి పర్శారాం ప్రపంచ తెలుగు మహాసభలకు రావల్సిందిగా నీల కంఠంకు ఆహ్వానం పంపారు. తెలుగు భాష గొప్పతనం అనే అంశంపై నీలకంఠం కీలక ఉపన్యాసం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు, సినీతారలు పాల్గొననున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు నీలకంఠంకు ఆహ్వానం రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ అక్రమ దందాలు ప్రజలకు తెలుసు

తంగళ్లపల్లి, జనవరి 2: బీఆర్ఎస్ నాయకుల అక్రమ దందాలు ప్రజలకు తెలుసని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారం దూరమైందని కేకే మంహేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారుడు కేకే మహేందర్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు వారికి లేదన్నారు. విలీన గ్రామాలపై కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు కపట ప్రేమ చూపించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, గుగ్గిళ్ల శ్రీకాంత్, పొన్నం పర్శరాములు, చుక్క శేఖర్, గడ్డం మధుకర్, ముక్క వాసు, హారిక రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంక్ రుణం ద్వారా కారు మంజూరు

గంభీరావుపేట, జనవరి 2: గంభీరావుపేట మండల కేంద్రంలోని కేంద్ర సహకార బ్యాంక్ రుణం కింద మంజూరైన కారును మంగళవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అందజేశారు. సముద్రలింగాపూర్‌కు చెందిన సుదమాల మహేందర్‌కు గంభీరావుపేట సహకార బ్రాంచ్ నుంచి కారు మంజూరైంది. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నర్మాల, లింగాపూర్ సర్పంచులు రాజు, రాజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎర్ర రామాంజనేయులు, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సీఈవో రాజిరెడ్డి, సింగిల్‌విండో మేనేజర్ సత్యంరావు ఉన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే 'ప్రజాపాలన'



నిమ్మపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 2: ప్రజల సంక్షేమం కోసమే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమం జనవరి 6 వరకు కొనసాగుతుందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు, వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆరు గ్యారెంటీల కోసం కాకుండా ఇతర సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తులను కూడా స్వీకరించేందుకు జనరల్ కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు దారుల సందేహాల నివృత్తికి దరఖాస్తు పూరించడంలో సహాయకారిగా ఉండేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షల వరకు పెంపు వంటి హామీలను అమలు చేసినట్లు చెప్పారు. 4 రోజుల కింద అధికారుల వివరాల ప్రకారం ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల్లో సుమారు నాలుగు కోట్ల వరకు జీరో టికెట్లపై మహిళలు ప్రయాణం చేశారన్నారు. మిగతా గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో తనని గెలిపించిన కోనరావుపేట మండల ప్రజలకు, నిమ్మపల్లి గ్రామస్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రకాశరావు, ఎంపీడీవో రామకృష్ణ, మాజీ సెస్ చైర్మన్ కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, సదానందం, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ప్రజా పాలన'

ముస్తాబాద్: ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అర్హతగల ప్రతీ కుటుంబం సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ రైతు వేదికలో, ముస్తాబాద్ మండలం కొండా పూర్‌లోని రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ దరఖాస్తు దారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అధికారుల బృందాలు నిర్దేశిత షెడ్యూల్ మేరకు ప్రతీ గ్రామం, వార్డులో ప్రజా పాలన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు ఆరు గ్యారెంటీలు అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అర్హులైన ప్రతీ ఒక్క కుటుంబం నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. రేషన్ కార్డు లేకున్నా దరఖాస్తులు స్వీకరించాలని, మహిళలు, వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆరు గ్యారంటీల కోసం కాకుండా ఇతర సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తులను కూడా స్వీకరించేందుకు జనరల్ కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు దారుల సందేహాల నివృత్తికి, దరఖాస్తు పూరించడంతో సహాయకారిగా ఉండేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, ఎంపీడీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అధికారులు సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: ప్రజా పాలన సభలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలకు అధికారులు సహకరించాలని, సమన్వయంతో పని చేసి జిల్లాలోని అర్హత కల్గిన ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకునేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, హరిదాస్‌నగర్, దుమాల, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో అభయహస్తం ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. వెంకటాపూర్‌లోని ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో డిసెంబరు 28న ప్రారంభమైన ప్రజా పాలన కార్యక్రమంలో ఈ నెల 6 వరకు కొనసాగుతుందన్నారు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దశల వారీగా ఆరు గ్యారెంటీలను అందజేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల కోసం ఇతర సమస్యల పరిష్కారానికి వచ్చే వారికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సర్పంచులు అంజమ్మ, రజిత, అమృత, డీపీవో రవీందర్, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో చిరంజీవి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు తిరుపతిబాబు, మల్లేశం, భాస్కర్ పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్ల టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనలో గడువులోగా ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం 34వ వార్డుతోపాటు వివిధ వార్డుల్లో ప్రజా పాలన అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి మాట్లాడారు. ప్రజా పాలన దరఖాస్తులను ఈ నెల 6 వరకు స్వీకరించనున్నట్లు చెప్పారు. గడువులోపు దరఖాస్తులు సమర్పించ లేని ప్రజలు సిరిసిల్ల పురపాలక సంఘంలో అందజేయాలని సూచించారు. కొత్త రేషన్ కార్డు, ఇతర ప్రభుత్వ సహాయ సహకారాలు కావాలనుకునే వారు తెల్ల కాగితంపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ బేగ్ అలీ, డీఈ ప్రసాద్, 34వ వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తనసందీప్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వంతడుపుల, రహీంఖాన్‌పేట, వెల్జీపూర్, గూడెపుపల్లి గ్రామాల్లో దరఖాస్తులు ఇవ్వడానికి పెద్ద ఎత్తున ప్రజలు గ్రామపంచాయతీ కార్యాలయాలకు చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వైస్‌ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్, సర్పంచులు బిల్లవేని పర్శరాం, ఉడుతల రజిత, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, ఎంపీటీసీ ముత్యంరెడ్డి, తహసీల్దార్ జావెద్ అహమ్మద్, ఎంపీడీవో మీర్జా, అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



వృద్ధుడి వద్ద దరఖాస్తును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఎల్లారెడ్డిపేట: ఆరు గ్యారెంటీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఎల్లారెడిపేట మండలం వెంకటాపూర్, దుమాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, రాజేందర్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో నరేష్ కుమార్ కోరారు. వీర్నపల్లి మండలంలోని రంగంపేట, వన్‌పల్లి, శాంతినగర్, సీతారాం నాయక్ తండాలో మంగళవారం అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు గ్యారెంటీలకు అర్హులైన ప్రతీ ఒక్కరు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి, లింగన్నపేట గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ డైరెక్టర్ నారాయణ రావు, తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలం మారుపాకలో నిర్వహిస్తున్న ప్రజాపాలన అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆరు గ్యారెంటీలు అందించడం కోసం సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఎంపీపీ బూర వజ్రవ్వబాబు, సర్పంచ్ చెన్నమనేని స్వయంప్రభ, ఎంపీడీవో శ్రీధర్ తదితరులు ఉన్నారు.

చందుర్తి: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేందుకే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని ఎనగల్, సనుగుల, కిష్టంపేట గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రదీప్, ఏపీఎం రజిత, ఎంఏవో దుర్గరాజు, పీఆర్ఏఈ వెంకటేశ్వర్లు, సర్పంచులు లింగంపల్లి సత్తయ్య, లింగంపల్లి కరుణాకర్, అంబిరి కల్పన, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుద్రంగి: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అల్లూరి మానస అన్నారు. రుద్రంగి మండలం మానాలలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 617 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. వైస్ ఎంపీపీ కీసరి భూమయ్య నాయకులు మోహన్, వంశీ, జలపతి తదితరులు పాల్గొన్నారు

83,459కు చేరిన దరఖాస్తులు

సిరిసిల్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్వీకరిస్తున్న అభయహస్తం దరఖాస్తులు 83 వేల 459 చేరాయి. మంగళవారం 39 గ్రామ పంచాయతీలు, 13 మున్సిపల్ వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో 30 వేల 488 దరఖాస్తులు వచ్చాయి. ఇతర దరఖాస్తులు 3647 వచ్చాయి.

ప్రజాపాలన కార్యక్రమాలు బుధవారం 38 గ్రామాల్లో నిర్వహించనున్నారు. బోయినపల్లి మండలం రామన్నపేట, రత్నంపేట, తడగొండ, స్థంభంపల్లి, చందుర్తి మండలం మల్యాల, కొత్తపేట, దేవుని తండా, ఇల్లంతకుంట మండలం జంగమరెడ్డిపల్లె, తిప్పాపురం, పెద్దలింగాపూర్, దాచారం, గంభీరావుపేట మండలం శ్రీగాధ, కొళ్లమద్ది, నర్మాల, కోనరావుపేట మండలం మామిడిపల్లి, నిజామాబాద్, జై సేవాలాల్ సభూక్యారెడ్డిపల్లి, జై సేవాలాల్ తండా, ముస్తాబాద్ మండలంలో గూడూరు, నామపూర్, మొర్రాపూర్, గన్నేవానిపల్లె, రుద్రంగి మండలంలో రుద్రంగి, తంగళ్ళపల్లి మండలంలో మల్లాపూర్, మండెపల్లి, నర్సింహులపల్లె, నేరేళ్ల, వీర్నపల్లి మండలంలో వీర్నపల్లి వేములవాడ మండలంలో అనుపురం, వేములవాడ రూరల్ మండలంలో తుర్కాశినగర్, లింగంపల్లి, ఫాజుల్‌నగర్, హన్మాజిపేట, ఎల్లారెడ్డిపేట మండలంలో బొప్పాపూర్, గొల్లపల్లి, దేవునిగుట్టతండా, కోరుట్లపేటలో దరఖాస్తుల స్వీకరణకు ప్రజాపాలన నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.



మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు



దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



దరఖాస్తు స్వీకరిస్తున్న వైస్ ఎంపీపీ

మాఘ అమావాస్య జాతరకు ఏర్పాట్లు చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 2 : మాఘ అమావాస్య జాతర ఏర్పాట్లు ఆధ్యాత్మికత పెంపొందించే విధంగా చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి సీతారాముల స్వామి మాఘ అమావాస్య జాతర ఏర్పాట్లపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తన చిన్నతనం నుంచి మామిడిపల్లి సీతారాములస్వామిని దర్శించుకుంటున్నానన్నారు. గతంలో స్వామి వారిని దర్శించుకునేందుకు ఎడ్లబండ్లపై వచ్చేవారిమన్నారు. ఈ మాఘ అమావాస్య జాతరకు సుమారు 30 వేల మంది భక్తులు తరలివస్తారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భారీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఫిబ్రవరి 9వ తేదీన జరిగే ఈ జాతరకు భక్తి పారవశ్యాన్ని తెలిపే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ విజయ ప్రకాశరావు, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ఎంపీడీవో రామకృష్ణ, ఎస్సై ఆంజనేయులు, వైద్యాధికారి వేణుమాధవ్, సర్పంచ్ కొక్కుల భారతి, వేములవాడ రాజన్న ఆలయ అధికారులు ఈ ఈ రాజేశం, ఏఈవో శ్రీనివాస్, డి.రామేశ్వరరావు, సూపరింటెండెంట్ శ్రీరాములు, ఏఈలు రామ్‌కిషన్, శేఖర్, ఆలయ అధికారులు కమలాకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన గ్రామ సభలకు స్పందన



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఉమేష్‌రావు

గంభీరావుపేట, జనవరి 2 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన గ్రామ సభలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోందని టీపీసీసీ సీనియర్ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటీ ఉమేష్‌రావు అన్నారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి, లింగన్నపేటలో మంళవారం ప్రజా పాలన గ్రామ సభలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలవుతాయన్నారు. ప్రజా పాలన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజా పాలన గ్రామసభలకు అందుబాటులో ఉండాలని, ప్రజలకు సహకరించాలని సూచించారు. జిల్లా కిసాన్ సెల్ జాయింట్ సెక్రెటరీ దమ్మ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రకాస్, బీసీ మండల అధ్యక్షుడు గుర్రం రాజు, యూత్ మండల అధ్యక్షుడు మదన్‌నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి



నూకలమర్రి జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు

సిరిసిల్ల టౌన్, జనవరి 2: యువత క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. మంగళవారం కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జిల్లా స్థాయి జూనియర్స్(బాలబాలికల) కబడ్డీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. అనంతరం టోర్నమెంట్‌లో పాల్గొంటున్న 20 జట్ల క్రీడాకారులను చైర్ పర్సన్ కళాచక్రపాణి పరిచయం చేసుకున్నారు. జిల్లా స్థాయి కబడ్డీ ఫైనల్స్‌ను సాయంత్రం డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ప్రారంభించారు. బాలికల విభాగం ఫైనల్స్‌లో తంగళ్లపల్లి, సిరిసిల్ల జట్లు తలపడ్డాయి. తంగళ్లపల్లి జట్టు విజయం సాధించింది. సిరిసిల్ల జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలుర విభాగంలో నూకలమర్రి, అనుపురం జట్లు తలపడ్డాయి. హోరాహోరిగా జరిగిన పోరులో నూలకమర్రి జట్టువిజయం సాధించగా అనుపురం జట్టు రన్నరప్‌గా నిలించింది. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. సాయంత్రం విజేత జట్లకు ముఖ్య అతిథి కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జిందం చక్రపాణి బహుమతులను ప్రదానం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, కబడ్డీ జిల్లా అసోసియేషన్ సభ్యుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు